క్లుప్తంగా

కళావేదిక కమిటీ ఎన్నిక


గంట నాగలక్ష్మి, అధ్యక్షురాలు


జ్యోతుల ప్రీతి, ఉపాధ్యక్షురాలు

మోతె : మండలంలోని విభళాపురం గ్రామానికి చెందిన గంట నాగలక్ష్మి, కొత్తగూడెం గ్రామానికి చెందిన జ్యోతుల ప్రీతి తెలంగాణ కళావేదిక నియోజకవర్గ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ వారిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ప్రజాప్రతినిధులకు నేడు సన్మానం

మఠంపల్లి : మండలానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులను ఈనెల 8న మండలంలోని చౌటపల్లి వద్ద గల శ్రీలక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో పార్టీ ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి హాజరవుతారని తెలిపారు.

17వరకు పీర్ల సందడి

హుజూర్‌నగర్ : పట్టణంలో ఈనెల 17వరకు నిర్వహించే పీర్ల పండగను విజయవంతం చేయాలని ముజావర్లు సైదా, మోహిన్, నాగులు, మీరా, యాదవ పెద్దలు జక్కుల మల్లయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని పీర్ల చావిడి వద్ద పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో యాదవపెద్దలు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1 మెయిన్స్‌కు ఎంపిక

గరిడేపల్లి : టీజీపీఎస్సీ ఆదివారం ప్రకటించిన గ్రూప్ వన్ ప్రిలిమ్స్ ఫలితాల్లో మండలంలోని వెలిదండ గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు సోదరులు క్వాలీఫై అయ్యి మెయిన్స్‌కు ఎంపికయ్యారు. గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఈ సోదరులు తొలి నుంచి ప్రతిభా సామర్థ్యాలతో, క్రమశిక్షణతో గ్రూప్స్ పరీక్షలకు ప్రీపేర్ అవుతున్నారు. సోదరులలో ప్రస్తుతం శ్యాంసుందర్ జూనియర్ అసిస్టెంట్‌గా, రాము ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండగా దశరథ బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేసి గ్రూప్ వన్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ముగ్గురు సోదరులు ఫైనల్ పరీక్షల్లో ఉత్తీర్ణులై గ్రూప్‌-1 ఉద్యోగం సాధించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

మునగాల : టీజీపీఎస్సీ ఆదివారం ప్రకటించిన గ్రూప్ -1 ప్రిలిమ్స్ ఫలితాల్లో మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన కాకునూరి గోపాల్‌రెడ్డి, మండల కేంద్రానికి చెందిన ఈట పవన్‌కుమార్ క్వాలీఫై అయ్యి మెయిన్స్ అర్హత సాధించారు. నిరుపేద అయిన గోపాల్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ(హిస్టరీ)పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు.

రైతులు సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

మోతె : వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ వారివారి పంటల వివరాలను గ్రామపంచాయతీల్లో లేదా రైతు వేదికల్లో నమోదు చేసుకోవాలని రావిపహాడ్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి కార్తీక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటల వివరాలు నమోదు చేసుకోవడానికి పాస్‌పుస్తకం జిరాక్స్‌తో కార్యాలయానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకోని యెడల వరికొనుగోలు కేంద్రాల్లో, పత్తి సీసీఐలో అమ్ముకోవడానికి అవకాశం ఉండదన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా చేపడుతున్న కల్యాణ మండపం నిర్మాణానికి కోదాడకు చెందిన రఘు కృష్ణమూర్తి, రమాదేవి దంపతులు ఆదివారం రూ.35వేల విరాళం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భౌరిశెట్టి వెంకటరత్నం, కొండా వెంకన్న, దయాకర్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న కీసర సంతోష్‌రెడ్డి

మోతె : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి మండల కేంద్రంలో పంపిణీ చేశారు. హుస్సేన్‌బాద్ గ్రామానికి చెందిన మొగిలిచర్ల నాగయ్యకు రూ.60వేలు, దండుగల భద్రమ్మకు రూ.20వేలు, కూడలి గ్రామానికి చెందిన ఉసిరికపల్లి ఉపేందర్‌కు రూ.10వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రామీణ లింకురోడ్లకు మహర్దశ


మెటల్ రోడ్డుగా మారనున్న భీల్యానాయక్‌తండా- అల్లీపురం లింకురోడ్డు


డబుల్ రోడ్డుగా మారనున్న అమరవరం -అలింగాపురం రోడ్డు

- మెటల్ రోడ్డుగా మారనున్న భీల్యానాయక్‌తండా- అల్లీపురం రోడ్డు
- అమరవరం నుంచి అలింగాపురం వరకు డబుల్ రోడ్డు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మఠంపల్లి: మండలంలో గ్రామాలు, గిరిజన తండాలను కలుపుతున్న పలు గ్రామీణ లింకురోడ్లు మెటల్ రోడ్డుగా మారనున్నాయి. మఠంపల్లి మండలంలోని భీల్యానాయక్‌తండా జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అల్లీపురం గ్రామం వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం గల డొంక దారిగా ఉన్న ఈ లింక్‌రోడ్డులో మెటలింగ్ చేసేందుకుగాను రూ.69లక్షలు మంజూరయ్యాయి. ఈ రోడ్డును బాగుచేస్తే అల్లీపురం, అంజలీపురం, అంత్యాతండా, దుబ్బతండా గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. పాచ్యాతండా నుంచి కప్పలకుంట వరకుగల డొంక రోడ్డును మెటలింగ్ చేసేందుకుగాను రూ.60లక్షలు మంజూరయ్యాయి. అదేవిధంగా హుజూర్‌నగర్ మండలం అమరవరం నుంచి పాలకీడు మండలం అలింగాపురం వరకుగల సుమారు 12కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్‌గా మార్చేందుకు రూ.23కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే మఠంపల్లి మండలంలోని భీల్యానాయక్‌తండా, బాడవాతండా, అంత్యాతండా, నిమ్మతండా, బోడబండతండా, బక్కలచ్చితండా, వరదాపురం, చెన్నాయిపాలెం ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. రోడ్ల మరమ్మతులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు మంజూరు చేయించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం



మా గిరిజన తండాలను కలుపుతూ ఉన్న లింక్ రోడ్లు బాగుపడితే మా కష్టాలు తొలగుతాయి. ముఖ్యంగా డబుల్ రోడ్డు నిర్మాణం కోసం చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. మంత్రి చొరవతో నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది.

– బానోతు బాబునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్, భీల్యానాయక్‌తండా

రోడ్లు బాగుపడతాయి



గిరిజనతండాలను కలుపుతూ ఉన్న లింక్ రోడ్లకు నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది. చాలా ఏళ్లుగా రోడ్ల బాగుకోసం ఎదురుచూస్తున్నాం. ఎట్టకేలకు ప్రభుత్వం చొరవ చూపడంతో రోడ్లు బాగుపడతాయని ఆశిస్తున్నాం.

– ధారావత్ గోవింద్‌నాయక్, మాజీ సర్పంచ్, బాడవాతండా

దండోరా రజతోత్సవాలకు తరలిన నాయకులు


రజతోత్సవాలకు వెళ్తున్న నాయకులు

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో టీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగ దండోరా రజతోత్సవాలకు కోదాడ నుంచి ఆ సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబుమాదిగ మట్లాడుతూ.. మాదిగ, మాదిగ ఉపకులాల ఏబీసీడీ వర్గీకరణే లక్ష్యంగా 30సంవత్సరాలు ఎమ్మార్పీఎస్ అనేక ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేంత వరకు తమ పోరాటం కొనసాగుతునే ఉంటుందన్నారు. వెళ్లిన వారిలో నియోజకరవర్గ ఇన్‌చార్జ్ బాణాల అబ్రహ్మం, పట్టణ అధ్యక్షుడు ఏర్పుల చిన్ని మాదిగ, బొల్లెపోగు స్వామి, కందుకూరి నాగేశ్వరరావు, కొత్తపల్లి శ్రీను, పిడమర్తి బాబురావు, రాంబాబు, నరసయ్య, గుర్వయ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ జయంతిని జయప్రదం చేయాలి

మఠంపల్లి : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న దివంగత మాజీ సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని జయప్రదం చేయాలని వైఎస్‌ఆర్ అభిమాన సంఘం జిల్లా నాయకుడు గాదె జయభారత్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానికంగా వైఎస్‌ఆర్ వద్ద విగ్రహం వద్ద కేక్ కట్ చేసి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ అభిమానులు కర్నె వెంకన్న, జార్జిరెడ్డి, ఇన్నారెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డిన్నారు.

పాఠాలు చెప్పేందుకు విద్యార్థులేరి?

- కొమ్ముబండతండా, సీతరాంతండా పాఠశాలల్లో ఈ ఏడాది చేరని విద్యార్థులు
- ప్రతి రోజు పాఠశాలకు ఖాళీగా వచ్చిపోతున్న ఉపాధ్యాయులు


విద్యార్థులు లేని కొమ్ముబండతండా పాఠశాల

చిలుకూరు : ఆ పాఠశాలలకు ఉపాధ్యాయులు నెల రోజుల పైనుంచి ప్రతిరోజు వెళ్తున్నారు. కాని నేటి వరకు ఒక్క విద్యార్థి కూడా ఆ పాఠశాలల్లో చేరలేదు. బడిబాటలో తిరిగినా ఫలితం శూన్యంగా మారింది. దీంతో ఉపాధ్యాయులు ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి ఖాళీగా కూర్చుని మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం కాగానే తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ ఘటన చిలుకూరు మండలంలోని కొమ్ముబండ తండా, సీతరాంతండా ప్రాథమిక పాఠశాలల్లోనిది. బడిబాటలో భాగంగా అ పాఠశాలలోని ఉపాధ్యాయుల గ్రామంలో తిరిగినా విద్యార్థులు చేరలేదు. దీంతో అ పాఠశాలలు మూతవేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులను మండలంలో అవసరం ఉన్న పాఠశాలలకు బదిలీ చేయడమే ఇక మిగిలింది. మండలంలోని కొమ్ముబండ తండా నూతనంగా ఏర్పాటైన గ్రామపంచాయతీ. కాని ఈ గ్రామం గ్రామపంచాయతీ కాకముందే ఈ గ్రామంలో పాఠశాల ఉంది. ప్రారంభంలో ఈ పాఠశాల విద్యార్థులతో కళకళలాడింది. పదేళ్లుగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. చివరకు గత విద్యాసంవత్సరం ఈ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు ఓ ఉపాధ్యాయుడు పాఠాలు బోధించాడు. ఈ విద్యాసంవత్సరం నేటి వరకు ఒక విద్యార్థి కూడా చేరలేదు, దీంతో ప్రతి రోజు ఉపాధ్యాయులు రావడం పాఠశాల తాళాలు తీయడం విద్యార్థుల కోసం ఎదురుచూస్తూ కూర్చోవడం పరిపాటిగా మారింది. ఇదే పరిస్థితి సీతరాం తండాలో కూడా నెలకొంది. అయితే ఈ గ్రామంలో విద్యార్థులు ఉన్నా ఆటోల్లో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ఇదేంటని పిల్లల తల్లిదండ్రులను ప్రశ్నిస్తే ఇక్కడ పాఠాలు సరిగా చెప్పరని సమాధానం చెబుతున్నారు.

సామినేని వెంకటేశ్వరరావు మృతికి సంతాపం


వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని తమ్మర గ్రామ మాజీ సర్పంచ్, గ్రామ సీతరామచంద్రస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు(84) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని పలు పార్టీల నాయకులు, పలు గ్రామాలకు చెందిన ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వెంకటేశ్వరరావు గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. భూస్వామిగా ఉంటూ పరిసర ప్రాంతంలోని అనేక మంది పేద ప్రజలకు తనవంతుగా సహాయ సహకారాలు అందించారని గుర్తుచేశారు. నివాళులర్పించిన వారిలో టీపీసీసీ సభ్యులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, కందుల కోటేశ్వర్‌రావు, తూమాటి వరప్రసాద్‌రెడ్డి, రావెళ్ల సీతారామయ్య, డాక్టర్ సుబ్బారావు, పలువురు కౌన్సిలర్‌లు, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఉద్యోగులు, నాయకులు తదితరులు ఉన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం


సమావేశంలో మాట్లాడుతున్న నయీం

కోదాడరూరల్ : పట్టణంలోని చిరు వ్యాపారులకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.నయీం అన్నారు. ఆదివారం పట్టణంలోని మండపం ఏరియా డబ్బీకొట్ల దుకాణాదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిరు వ్యాపారులు ఐక్యంగా ఉంటూ తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మండపం ఏరియాలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేసిన వారిని అడ్డుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్.నయీం, గౌరవ సలహాదారుడిగా బొలిశెట్టి కృష్ణయ్య, అధ్యక్షుడిగా పాండురంగారావు, ప్రధాన కార్యదర్శిగా భూసాని మల్లారెడ్డి, కోశాధికారిగా ఎండీ.మహ్మద్, ఉపాధ్యక్షుడిగా దస్తగిరి, సహాయ కార్యదర్శులుగా వేణుగోపాలరావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వ్యవసాయ కార్మికులకు ఇళ్లు నిర్మించాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాలకవీడు : నిరుపేద వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశాడు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం కల్పించకుండా కార్పొరేట్ వ్యాసాయాలకు మద్దతు పలుకుతుందని విమర్శించారు. చిన్న సన్నకారు రైతులు కేంద్రంపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. నిత్యం వ్యవసాయ రంగంలో కూలీలుగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వమే ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆయన వెంట ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ప్రజానాట్య మండలి కళాకారుడు లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

9న సీత్లా భవానీ పండుగ


సమావేశంలో మాట్లాడుతున్న సందీప్‌నాయక్

గరిడేపల్లి : బంజారా గిరిజనులు ఎంతో పవిత్రంగా జరుపుకునే సీత్లా భవానీ (దాటుడు) పండుగను వేర్వేరు తేదీల్లో కాకుండా రాష్ట్రంలోని గిరిజనులంతా ఒకేసారి ఈనెల 9న మంగళవారం జరుపుకోని తమ ఐక్యతను చాటుకోవాలని సేవాలాల్ సేనా మండల అధ్యక్షుడు గుగులోతు సందీప్‌నాయక్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతిని గిరిజనులు కట్టుబొట్టు వేషధారణ ఆచార్య వ్యవహారాలు సంస్కృతి, సంప్రదాయాలు అతి పవిత్రమైనవి అని ఆయన అన్నారు. అదే విధంగా పండుగల సందర్భంగా పశువులను అలంకరించడం గిరిజన జాతి పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తుందన్నారు. పశుసంపద ఆరోగ్యంగా ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆషాడమాసం శుక్లపక్ష మొదటి మంగళవారం జరుపుకుంటారని ఆయన తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


మునగాలలో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ చేస్తున్న నాయకులు


కోదాడరూరల్ : ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న రాజుమాదిగ

మునగాల : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ మండల శాఖల ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతో పాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తొలుత మండల కేంద్రంలోని అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి డా.కత్తి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో ఒక కుల సంఘం 30సంవత్సరాల సుదీర్ఘ పోరాటాన్ని శాంతియుతంగా నడిపిన చరిత్ర ఒక్క మంద కృష్ణమాదిగకే దక్కిందన్నారు. ఒక దేశప్రధాని మాదిగ మహాసభలకు వచ్చి ఏబీసీడీ వర్గీకరణకు మేము కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చినటువంటి ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకులు పిడమర్తి సైదులుమాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబుమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పాతకొట్ల నాగరాజుమాదిగ, ఎంఎస్పీ మునగాల మండల శాఖ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్యమాదిగ, మండల నాయకులు గద్దల అశోక్, మొలుగూరి వెంకటేశ్వర్లు, పాతకొట్ల విక్రమ్, కేవీఆర్, మొలుగూరి రమేష్ పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని హరిజనవాడలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ.. మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ వర్గీకరణ సాధిస్తామన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, నాయకులు సిద్దెల శ్రీనివాస్‌మాదిగ, కందుకూరి నగేష్, యల్లయ్య, సైదులు, తిరపయ్య, వీరబాబు, రామారావు, రాము, వీరయ్య, రాములు, రాకేష్, జనార్దన్, అశోక్, సాయి, మహేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష , ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పండిటి నవీన్‌కుమార్, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల ప్రకాష్, నాయకులు బాణాల నాగరాజు, దున్నా రాజు, దున్నా సతీష్, నూకపంగు గుర్వయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, అంజయ్య, నమృత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కాలయాపన తగదు

మఠంపల్లి : ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వాలు కాలయాపన చేయడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దేవపంగు ప్రసాద్‌మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బచ్చలకూరి ప్రసాద్‌మాదిగ, బాలచంద్రుడు మాదిగ, తిరుపయ్య, ఏబుమాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంద కృష్ణమాదిగ జన్మదినం

కోదాడరూరల్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు, ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావాన్ని ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏపూరి రాజుమాదిగ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. 1994లో ఏర్పడిన ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగా మాదిగ జాతి ఆత్మగౌరవంతో బతుకుతుందన్నారు. మందకృష్ణ పోరాటాలతోనే మాదిగ జాతి తమ కులం పేరును గర్వంగా చెప్పుకుంటుందన్నారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఏబీసీడీ వర్గీకరణ సాధిస్తామనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యరాజు మాదిగ, కుక్కల కృష్ణమాదిగ, బచ్చలకూరి వెంకన్న, బ్రహ్మం, అమరబోయిన ప్రభుమాదిగ, గోపి తదితరులు ఉన్నారు.

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దేవపంగు బాబు, మాజీ ఎంపీటీసీ మేడి సామేలు, నాయకులు నరేష్, జోజి, బుంగయ్య, ప్రవీణ్‌కుమార్, ఏసు, తదితరులు పాల్గొన్నారు.


మఠంపల్లి : రఘునాథపాలెంలో కేక్ కట్ చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు


మోతె : కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మోతె : మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మారపంగు రామాంజి, జిల్లపల్లి లెనిన్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కేవలం మాల మాదిగలకే కాకుండా 59ఉపకులాలకు జరిగే అన్యాయంపై మంద కృష్ణ మాదిగ పోరాటం చేస్తున్నారన్నారు. కేవలం మాదిగ ఉపకులాలకు కాకుండా సామాజిక అంశాల పట్ల బాధ్యతతో పనిచేస్తున్న నిఖార్సైన నాయకుడు మంద కృష్ణమాదిగ అని కొనియాడారు. నరేంద్రమోదీ ఇచ్చిన హామీ నెరవేర్చేంత వరకు ప్రతిఒక్కరూ శ్రమించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు జిల్లపల్లి శివకృష్ణ, పల్లెల లక్ష్మణ్, రాము, వెంకన్న, వీరబాబు, గోవర్ధన్, స్కైలాబ్, తిరుమలేష్, గౌతమ్, భరత్, సాయి, రాజు, తదితరులు పాల్గొన్నారు.


మఠంపల్లి : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


నడిగూడెం : వేడుకల్లో పాల్గొన్న నాయకులు


చిలుకూరులో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న వడ్డేపల్లి కోటేష్

లొడంగి శంభయ్య మృతి బాధాకరం


శంభయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన యాదవ సంఘం సీనియర్ నాయకుడు లొడంగి శంభయ్య మృతి బాధాకరమని మాజీ వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాంగ్రెస్ మండల నాయకుడు నల్లపాటి శ్రీనివాస్ అన్నారు. శంభయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాడువాయిలో యాదవ సంఘం అభివృద్ధికి శంభయ్య ఎంతగానో కృషిచేశాడని కొనియాడారు. శంభయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లొడంగి సంజీవ, కాంగ్రెస్ నాయకులు జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, చిర్రా సైదులు, కొండమీది గుర్వయ్య, సొంపంగు గోపి, జిల్లెపల్లి బాలకృష్ణ, కోల వెంకటేశ్వర్లు, మొలుగూరి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అమలు చేయాలి

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు పెద్దింటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయని ఆయన ఆరోపించారు. రైతులకు వ్యవసాయ సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, అశోక్, రవి, రాములు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న అనిల్‌కుమార్

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన జోత్స్న తల్లిదండ్రులను కోల్పోయి నానమ్మ సంరక్షణలో ఉంటుండడంతో చిన్నారికి డాక్టర్ ఇనుకుర్తి అనిల్‌కుమార్, ఇనుకుర్తి హాసిని ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. జోత్స్నకు భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.